క్లుప్తంగా

వైభవంగా అయోధ్య అక్షింతల శోభాయాత్ర



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న రామ భక్తులు

భీమునిపట్నం: అయోధ్య రామ మందిరానికి స్వామి వారి అక్షింతల శోభా యాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంటుభుక్త రామానాయుడు మాట్లాడుతూ ఈ పవిత్ర అక్షింతలకు వారం రోజులుగా నెహ్రూ స్కూల్ వద్దనున్న రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. వీటిని అన్ని దేవాలయాలకు, ఇంటింటికీ అందిస్తామని తెలిపారు. ముమ్మిడిశెట్టి సత్యానందం, వంశీ, పల్లా విజయకుమార్, పోలుబోతు విజయ, కంటుభుక్త సునీత పాల్గొన్నారు.

ముగిసిన మహానారాయణ సేవ



లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవా పీఠంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం అయ్యప్పస్వామి సేవా పీఠంలో 41 రోజులుగా మాలధారులకు అందిస్తున్న మహానారాయణ సేవ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ఏడేళ్లుగా సాగుతున్న కార్యక్రమాన్ని చూసి నిర్వాహకులను అభినందించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్‌లు గాడు వెంకటనారాయణ, లచ్చుభుక్త జగదీశ్వరరావు, పీఠాధిపతి గాడు తాతినాయుడు, గురుస్వాములు కరుభుక్త అప్పలనారాయణ, కంటుభుక్త వెంకన్న, గుడ్లాల కృష్ణ, కనకల గోవిందరావు, రోణంకి రవి నాగేశ్వరరావు, కనకల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలు నేడు ప్రారంభం

మధురవాడ: 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

ఆనందపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీలో మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొంటారని చెప్పారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు హాజరుకావాలని కోరారు.

శ్రీరాముడిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అధిష్టింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.

ప్రయాణికులకు షెల్టర్

- అనంతవరం జంక్షన్‌లో రూ.10 లక్షలతో నిర్మాణం
- ఎండా, వాన నుంచి ప్రయాణికులు సురక్షితం

ఇది కదా అభివృద్ధి



బస్ షెల్టర్‌లో ఏర్పాటు చేసిన పలక



అనంతవరం జంక్షన్‌లో నిర్మించిన బస్ షెల్టర్

పద్మనాభం: మండలంలోని అనంతవరం జంక్షన్‌లో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో బస్ షెల్టర్ నిర్మించారు. దీంతో ప్రయాణికుల కష్టాలు తీరాయి. గతంలో ఈ జంక్షన్‌లో చిన్న షెల్టర్ ఉండేది. అది చిన్నది కావడంతో ఐదుగురు ప్రయాణికులు ఉండేందుకు సరిపోయేది కాదు. మరోవైపు శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో ప్రయాణికులు కూర్చోవడానికి వీలు పడని పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వం కొత్తగా బస్ షెల్టర్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. పెంట, అనంతవరం, పాత కొవ్వాడ, కొత్త కొవ్వాడ, గొల్లలపాలెం గ్రామాలకు చెందిన వారు విజయనగరం వెళ్లడానికి, విజయనగరం నుంచి తమ గ్రామాలకు వెళ్లడానికి అనంతవరం జంక్షన్‌లోనే బస్సుల కోసం ఎండలో ఎండి, వానకు తడుస్తూ నిరీక్షించేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో అనంతవరం జంక్షన్‌లో సీఎం అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో బస్ షెల్టర్ నిర్మించారు. దీంతో ప్రయాణికులు ఆరుబయట బస్సుల కోసం నిరీక్షించే బాధలు తప్పాయి. ఇది కాకుండా పద్మనాభం జంక్షన్‌లో సీఎం అభివృద్ధి నిధులు రూ.10 లక్షలు, విజయానందపురం జంక్షన్‌లో సీఎం అభివృద్ధి నిధులు రూ.10లక్షలతో బస్ షెల్టర్లు నిర్మిస్తున్నారు. ఇవి ఇప్పటికే శ్లాబు దశకు చేరుకున్నాయి. వీటి నిర్మాణం పూర్తయితే ఆ ప్రాంతాల్లోని ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి.

ఎండా, వాన బాధ తప్పింది



అనంతవరం జంక్షన్‌లో బష్ షెల్టర్ నిర్మించడంతో ప్రయాణికులు ఎండా, వాన బారిన పడకుండా ప్రశాంతంగా ఉంటున్నారు. గతంలో షెల్టర్ నిర్మించక ముందు బస్సులు వచ్చేంత వరకు ఆరుబయట రోడ్డు మీద ఉండాల్సి వచ్చేది. ఎండకు ఎండి, వానకు తడుస్తూ ఉండేవారు. ఇప్పుడు బస్ షెల్టర్ నిర్మిచండంతో ఆ బాధలు తప్పాయి.

– పి.నారాయణ, కొత్త కొవ్వాడ

షెల్టర్ నిర్మించడం సంతోషకరం



అనంతవరం జంక్షన్‌లో బస్ షెల్టర్ నిర్మించడం చాలా సంతోషకరం. గతంలో చిన్న షెల్టర్ ఉండేది. అది శిథిలావస్థకు చేరుకోవడంతో బస్సులు వచ్చేంత వరకు అక్కడ ప్రయాణికులు ఉండడానికి వీలు లేని పరిస్థితి. కొత్తగా పెద్ద షెల్టర్ నిర్మిండంతో ప్రయాణికులంతా ప్రశాంతంగా నిరీక్షిస్తున్నారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– కె.రాము, అనంతవరం

కర్మల నుంచి తప్పించుకోవడం అసాధ్యం



మాట్లాడుతున్న బొడ్డేపల్లి అప్పలనాయుడు

తగరపువలస: కర్మల నుంచి తప్పించుకోవడం ఎవరికీ సాధ్యం కాదని శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన గీతా ప్రచారకుడు బొడ్డేపల్లి అప్పలనాయుడు అన్నారు. స్థానిక గీతాప్రచార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన కర్మయోగంలోని చక్రభ్రమనం గురించి ప్రవచించారు. కర్మ చేయని వారికి స్థిరత్వం ఉండదన్నారు. కర్మలు ఆచరించడం తప్పు కాదన్నారు. ఇదే విషయంలో శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని ఒప్పించి యుద్ధానికి కార్యోన్ముఖున్ని చేశారన్నారు. ఆత్మజ్ఞానం కలిగిన వాడే పండితుడన్నారు. పాపం లేని వారికే పవిత్ర జ్ఞానం చేరుతుందన్నారు. అనంతరం నిర్వాహకులు ప్రసాద వితరణ చేశారు.

యువకుడి అదృశ్యం



సంతోష్ కుమార్

ఆనందపురం : మండలంలోని మామిడిలోవ గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్టు ఆనందపురం పోలీసులకు సోమవారం ఫిర్యాదు అందగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మామిడిలోవకు చెందిన బలిరెడ్డి సంతోష్ కుమార్ (35) ఆనందపురంలోని పద్మ పూజిత ఆటో కనసల్టెన్సీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 10న మధ్యాహ్నం 12 గంటల సమయంలో పనిమీద వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అలా వెళ్లిన సంతోష్ సాయంత్రానికి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. తల్లి దేముడమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ పైడిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జెడ్పీ హైస్కూల్ రోడ్డులో ఆకతాయిల వేధింపులు



చిట్టివలస జెడ్పీ హైస్కూల్ రోడ్డు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో చీకటి పడితే జులాయిలు పేట్రేగిపోతున్నారు. ఈ మార్గంలో ఒంటరిగా వెళ్లే మహిళలు, ఉద్యోగులపై తమ ప్రతాపం చూపిస్తున్నారు. శనివారం రాత్రి ఈ రహదారిపై దివీస్ ఉద్యోగి ఒకరిని అడ్డుకుని జుగుప్సాకరంగా వ్యవహరించారు. నిత్యం ఈ రహదారిపై రెండు జెడ్పీ హైస్కూళ్లు, ఒక మహిళా డిగ్రీ కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, రెండు ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులతోపాటు భోగాపురం మండలానికి చెందిన గుడివాడ మీదుగా భీమిలి మండలంలోని మూడు పంచాయతీల ప్రజలు, వేలాది మంది దివీస్ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. తరచూ వీరంతా ఇక్కడ తిష్ట వేస్తున్న జులాయిల నుంచి వేధింపులు ఎదుర్కొంటూనే ఉన్నారు. వీరిలో మద్యం, గంజాయి వంటి దురలవాట్లకు లోనైన వారు చావుల మదుం రోడ్డు, గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు వద్ద రోజూ తారసపడుతుంటారు. వీరి చేష్టలతో చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడకు సమీపంలో కొండపై నిర్మానుష్యంగా ఉండటంతో పగటివేళ ఆకతాయిలంతా అక్కడే ఉంటున్నారని, పోలీసులు నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ మలుపు



జ్యూట్‌మిల్లు రామాలయం మలుపు వద్ద ప్రమాదకరంగా డ్రైనేజీ

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయాన్ని ఆనుకుని మలుపు వద్ద డ్రైనేజీ ప్రమాదకరంగా ఉంది. భీమిలి బొగ్గురోడ్డు, తగరపువలస కూడలి నుంచి రామాలయం మీదుగా భీమిలి మండలంలోని చిప్పాడ, పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీలకు రాకపోకలు సాగించేవారు ఇక్కడ రక్షణలేని డ్రైనేజీ వద్ద అయోమయానికి గురవుతున్నారు. హెచ్చరిక బోర్డులు లేకపోడంతో ఇక్కడ డ్రైనేజీ ఉన్న విషయాన్ని ద్విచక్ర వాహనదారులు గుర్తించలేకపోతున్నారు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ముఖ్యంగా మూడు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు వచ్చినప్పుడు గందరగోళానికి గురవుతున్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో అందరికీ కనిపించేలా డ్రైనేజీ ఎత్తు పెంచి ప్రమాదకరమైన మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రామీణాభివృద్ధికి వాజ్‌పేయి విశేషకృషి



వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ఆనందపురం నాయకులు



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆనందపురం : గ్రామీణాభివృద్ధికి భారతదేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విశేష కృషి చేశారని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. మండలంలోని వేములవలస, వెల్లంకి గ్రామాల్లో సోమవారం వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ సడక్ యోజన పథకం ద్వారా మారుమూల గ్రామాలకు సైతం తారురోడ్లు నిర్మించిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందని చెప్పారు. అన్నపూర్ణ పథకం ద్వారా పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించిన మహోన్నత నాయకుడని కొనియాడారు. ముందుగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఆనందపురం మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు పీవీవీ ప్రసాదరావు పట్నాయిక్, నాయకులు సాయి రమేష్, గంగ్రెడ్డి వెంకటరావు, ఉప్పాడ కృష్ణ, నిమ్మకాయల అప్పలరాజు, మాదాబత్తుల బుజ్జి, పొన్నాడ గురయ్య తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ: భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని మధురవాడలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 8వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో జెండా ఆవిష్కరించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాజ్‌పేయి స్ఫూర్తితో అంతా బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 8వ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, బీజేవైఎమ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ మాధవరావు, 8వ డివిజన్ కార్యదర్శి ఏకే సింగ్, 6వ డివిజన్ అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, కామేశ్వరరావు, సీతారాం, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: మాజీ ప్రధాని ఏబీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు ఆయన చిత్రపటానికి సోమవారం నివాళులర్పించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కార్యకర్త నుంచి జనసంఘ్ పార్టీ అధ్యక్షునిగా, బీజేపీ అధ్యక్షునిగా, అనేక పత్రికల సంపాదకునిగా పనిచేసిన మహనీయుడని కొనియాడారు. భారత రత్నతో గౌరవించుకున్నామన్నారు. అనంతరం ఆయన జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు.

చంద్రబాబు హయాంలో అంగన్‌వాడీలకు అన్యాయం

- కేంద్ర మంత్రి అయ్యాక చిట్టివలస కార్మికులకు న్యాయం చేస్తా
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



చిట్టివలసలో కేక్ కట్ చేస్తున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

తగరపువలస : తాను విశాఖ ఎంపీగా పోటీ చేసి, కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు న్యాయం చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. సోమవారం ఆయన తగరపువలసలో మాట్లాడారు. అనంతరం చిట్టివలసలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీల శిబిరాన్ని సందర్శించి వారిని ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబు గతంలో అంగన్‌వాడీలకు చాలా అన్యాయం చేశాడన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చాలని తాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్టు తెలిపారు. అయినా ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవన్నారు. మూడు నెలల సమయమిస్తే తాను ఎంపీ అయ్యాక వారి డిమాండ్లు పరిష్కరిస్తానన్నారు. చంద్రబాబు, కేసీఆర్, మోదీకి తాను కోట్లాది రూపాయల సాయం అందించానన్నారు. తాను పుట్టిన చిట్టివలస గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. టెన్త్ ఫెయిలైన తనకు జ్యూట్‌మిల్లులో రూ.300 ఉద్యోగం లభించక ఆత్మహత్య చేసుకుందామనుకున్న సమయంలో దేవుడు అండగా నిలిచి ప్రపంచ దేశాల్లో సువార్త వినిపించే సదవకాశం కల్పించారన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు చేసుకున్నారు. మరోవైపు తన చిన్ననాటి స్నేహితులను పలకరించారు. తాను చిట్టివలస విడిచి 44 ఏళ్లు పూర్తయినా, ఇప్పటికీ అందరూ గుర్తున్నారని పేరు పేరునా పలకరించారు.

దుప్పట్ల పంపిణీలో తోపులాట..

అంబేడ్కర్ కూడలి వద్ద కేఏ పాల్ దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్రమంలో స్వల్పంగా తోపులాట జరిగింది. 20 మందికి దుప్పట్లు, ఆహార పొట్లాలు తీసుకునిరాగా వందలాది మంది రావడంతో ఈ తోపులాట చోటుచేసుకుంది.

శాంతి, ప్రేమ, ఐక్యతే క్రిస్మస్ సందేశం



మారికవలస ఆర్‌జీకే కాలనీలో కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు



ఎండాడ జియోన్ కింగ్స్ మినిస్టర్ చర్చిలో వేడుకలు



పరదేశిపాలెంలో క్రిస్మస్ సందేశం ఇస్తున్న డాక్టర్ కేఆర్ సింగ్

మధురవాడ: ప్రేమ, శాంతి, ఐక్యతే క్రిస్మస్ సందేశమని బిషప్ డాక్టర్. కేఆర్.సింగ్ అన్నారు. ఆదివారం రాత్రి, సోమవారం పరదేశిపాలెం, బోయిపాలెంలోని నేతన్య చర్చిల్లో క్రిస్మస్‌ను పురస్కరించుకుని కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్.కేఆర్.సింగ్ మాట్లాడుతూ యేసు ప్రభువు భూమి పైకి వచ్చిన రోజే క్రిస్మస్ అన్నారు. ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకాన్ని ఎంతగానో ప్రేమించాడని చెప్పారు.

- మారికవలస ఆర్‌జీకే కాలనీలో ఫాస్టర్ జాన్‌వెస్లీ జిలానీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు, విశ్వాసులు కేక్ కట్ చేశారు.
- కొమ్మాది మాస్టర్ ప్లాన్ రోడ్డులో గల ఎమేజింగ్ పవర్ ఆఫ్ గాడ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు బైబిల్స్ పంపిణీ చేవారు. ఎ.మురళి, మర్రా శ్రీనివాస్, సియ్యాద్రి పైడితల్లి, రెవరెండ్ కాకిలేటి జాన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పాప ప్రక్షాళనకే జీసస్ అవతరణ

తగరపువలస: భువిపై మానవుల పాప ప్రక్షాళనకే దేవుడు మానవుని రూపంలో అవతరించి లోకాన్ని రక్షించాడని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం క్రిస్మస్ సందర్భంగా స్థానిక ఆంధ్రా బాప్టిస్ట్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మైనారిటీల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా చర్చి ప్రతినిధులకు కేక్ తినిపించారు. అలాగే ఒకటో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు చర్చికి 10 కిలోల కేకను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తరపున అందించారు. కార్యక్రమంలో పాస్టర్ సునీత్, అధ్యక్షుడు జాన్ ప్రకాష్, కార్యదర్శి జోసఫ్ జేమ్స్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, జిల్లా పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు పందిరి విజయ్, క్లస్టర్ ఇన్‌చార్జి ఉప్పాడ నాగేశ్వరావు, అక్కరమాని చినబాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక బ్యాంకు రోడ్డులోని ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన బాటలో అందరికీ సాయం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కీతిన్‌పేట వద్దనున్న సెయింట్ పీటర్స్ చర్చితోపాటు ఇతర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆనందపురం : మండలంలోని గ్రామాల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని చెప్పారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పలు చర్చిలలో ఏసు ప్రభువు జన్మ వృత్తాంతంతో నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

కొమ్మాది: సర్వ మానవాళి రక్షణ కోసం ఏసు ప్రభువు భూమిపై జన్మించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డులో సోమవారం క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎండాడలో గల జియోన్ కింగ్స్ మినిస్ట్రీస్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు ఆర్ఈవీ ఎలిపి, జార్జ్ ముల్లర్, ఇ.సుందర్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, రెడ్డిపల్లి, పద్మనాభం, కోరాడ, తునివలస, మద్ది, విలాస్కాన్‌పాలెం, పొట్నూరు, గంధవరం, అనంతవరం గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. గంధవరం చర్చిలో సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, ఎంపీటీసీ సభ్యుడు బి.వి.ఎస్.ఎన్.రాజు కట్ చేసి వేడుకలు ప్రారంభించారు.



గంధవరంలో పాస్టర్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు



కణమాం చర్చిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



చర్చి సభ్యులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కేక్ కట్ చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆధ్యాత్మిక మార్గంతో ప్రశాంత జీవనం



నిత్యావసర సరకులు అందిస్తున్న సద్గురు

భీమునిపట్నం: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడం ద్వారా ప్రశాంత జీవితం కొనసాగించవచ్చని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి సద్గురు డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. బీచ్‌రోడ్డులోని ఆధ్యాత్మిక పీఠం 22వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ప్రపంచంలో మానవ జన్మ అత్యంత గొప్పది, విలువైనదన్నారు. అటువంటి జన్మ పొందిన ప్రతి ఒక్కరూ ఈ జన్మను సార్థకత చేసుకునేలా బతకాలని సూచించారు. ఆధ్యాత్మిక మార్గంలో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. 42 మంది పేద మహిళలకు బియ్యం, నిత్యావసర సరకులు, దుప్పట్లు ఆయన అందించారు. కమిటీ సభ్యులు డి.వి.నారాయణరావు, డాక్టర్ ఆనంద్, కృష్ణ, ఉమాశంకర్ పాల్గొన్నారు.

హైవే దిక్సూచీలపై ఫ్లెక్సీలతో అయోమయం



మహరాజుపేట కూడలిలో హైవే దిక్సూచీలపై యువగళం ఫ్లెక్సీలు

తగరపువలస: రాజాపులోవ – రాయ్‌పూర్ జాతీయ రహదారిపై వాహదారుల ఉపయోగార్థం ఏర్పాటు చేసిన దిక్సూచీలను యువగళం ఫ్లెక్సీలు కమ్మేశాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే మార్గాలు మహరాజుపేట కూడలి వద్ద హైవేపై విడిపోతాయి. ఇదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల కారణంగా ఒక జిల్లా వైపు వెళ్లాల్సిన వాహనాలు మరొక జిల్లా వైపు వెళ్లిపోతున్నాయి. హైవే అధికారులు జోక్యం చేసుకుని దిక్సూచీలను మూసివేసిన ఫ్లెక్సీలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.